# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 27-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ యానిమేషన్ ప్రపంచంలో భారత్ సరికొత్త విప్లవం దిశగా అడుగులు వేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
- ❖ విమానాలకు వస్తున్న బాంబు బెదిరింపులను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగనిస్తోందని పౌర, విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.
- ❖ దేశ వృద్ధిలో భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.
- ❖ ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా త్వరలో భారత్ అవతరించనుందని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు.
- ❖ జపాన్ పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ టోర్నీలో పురుషుల సింగిల్స్‌లో బంగారు పతకం కైవసం చేసుకున్న భారత స్టార్ షట్లర్ సుకాంత్ కదమ్.

======================

యానిమేషన్ ప్రపంచంలో భారత్ సరికొత్త విప్లవం దిశగా అడుగులు వేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి తన మనసులోని బావాలను దేశ ప్రజలతో పంచుకునే “మన్ కి బాత్” కార్యక్రమం 115వ సంచిక ఈ రోజు ప్రసారమైంది. ఈ కార్యక్రమంలో నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. భారతదేశ గేమింగ్ పరిధి వేగంగా విస్తరిస్తోందని, భారతీయ ఆటలు కూడా ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయని పేర్కొన్నారు. భారతీయ యానిమేషన్ పాత్రలు, యానిమేషన్ సినిమాలు కంటెంట్, సృజనాత్మకత ప్రపంచ వ్యాప్తంగా ప్రజలను ఆకట్టుకుంటున్నాయని ఆనందాన్ని వ్యక్తం చేశారు. యానిమేషన్ ప్రపంచంలో “భారత్ లో తయారీ”, “భారతీయులచే తయారీ” అన్నవి ప్రబలంగా నాటుకుపోయాయని ప్రధానమంత్రి తెలియజేస్తూ..

(వాయిస్ 37 సెకన్లు)

=====================

పశ్చిమ బెంగాల్‌లోని భారత్ - బంగ్లాదేశ్ సరిహద్దులోని పెట్రాపోల్‌లోని ల్యాండ్ పోర్ట్ వద్ద కొత్తగా నిర్మించిన ప్యాసింజర్ టెర్మినల్ భవనాన్ని, 'మైత్రి ద్వార్' కార్గో గేట్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈరోజు ప్రారంభించారు. ఉత్తర 24 పరగణాస్ జిల్లాలో ఉన్న పెట్రాపోల్ ల్యాండ్ పోర్ట్ దక్షిణ ఆసియాలో అతిపెద్ద ల్యాండ్ పోర్ట్ గా ఉండటమే కాకుండా, రెండు దేశాల మధ్య వాణిజ్యానికి కీలకమైన గేట్‌వేగా పని చేస్తుంది. భారత్, బంగ్లాదేశ్ పౌరులకు అంతర్జాతీయ వాణిజ్యం క్రాసింగ్‌లను సులభతరం చేయడం ఈ ప్రయాణీకుల టెర్మినల్ లక్ష్యం.

=====================

ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా త్వరలో భారత్ అవతరించనుందని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. ఈ రోజు గుజరాత్ గాంధీనగర్‌లోని మహాత్మా మందిర్‌లో 17వ అర్బన్ మొబిలిటీ ఇండియా కాన్ఫరెన్స్ వేడుకలో పాల్గొన్న కేంద్రమంత్రి ప్రసంగిస్తూ... సుస్థిరమైన, సమగ్ర పట్టణ రవాణాను ఏర్పరచడంలో ప్రభుత్వం అద్భుతమైన పురోగతిని సాధించిందని అన్నారు. గత సంవత్సరాల్లో దేశంలో 725 కిలోమీటర్లకు పైగా పనులు ప్రారంభించగా, మరో 974 కిలోమీటర్ల మెట్రో నెట్‌వర్క్ నిర్మాణంలో ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 9 విభిన్న విభాగాలలో అధికారులకు పట్టణ రవాణాలో ఉత్తమ ప్రాజెక్ట్ అవార్డులను మంత్రి అందిచారు.

=====================

దేశ వృద్ధిలో భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఈ రోజు కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రభుత్వం అంతరిక్ష రంగానికి వెయ్యి కోట్ల రూపాయల వెంచర్ క్యాపిటల్ ఫండ్‌ను ప్రారంభించిందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం 3వ సారి అధికారంలోకి వచ్చిన మొదటి 100 రోజులలో చేపట్టిన ప్రధాన కార్యక్రమాలు ప్రపంచ ఆవిష్కరణ వేదికపై భారతదేశ పాత్రను ముందుకు తీసుకెళ్లేందుకు నిబద్ధతను తెలియజేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమాలు భారతదేశ వైజ్ఞానిక నైపుణ్యాన్ని పెంపొందించడమే కాకుండా పరిశ్రమలు, వనరులలో ప్రపంచ మార్పులను తట్టుకోగల స్థిరమైన, స్వావలంబనతో కూడిన ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటు అందిస్తాయని పేర్కొన్నారు.

విరామం

=====================

ఈరోజు పదాతిదళ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భారత సైన్యంలోని అన్ని విభాగాల, శ్రేణుల అచంచలమైన స్ఫూర్తి, ధైర్యాన్ని సామాజిక మాధ్యమం వేదికగా కొనియాడారు. పదాతి దళ సిబ్బంది ఎల్లప్పుడూ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ... దేశ భద్రతకు భరోసా ఇస్తారని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. పదాతిదళ సిబ్బందికి రక్షణ మంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. దేశాన్ని రక్షించడంలో ఈ దళం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

=====================

విమానాలకు వస్తున్న బాంబు బెదిరింపులను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని పౌర, విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. విశాఖ - విజయవాడ నగరాల మధ్య కొత్త విమాన సర్వీసులు విశాఖ విమానాశ్రయంలో ఈ రోజు కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాంబు బెదిరింపులపై లోతైన దర్యాప్తు జరుగుతోందని, ఈ బెదిరింపులను అరికట్టడానికి ఎక్స్, లా ఏజెన్సీలు,

ఇంటెలిజెన్స్ సహకారం తీసుకుంటున్నామని వివరించారు. సివిల్ ఏవియేషన్‌లో ఉన్న రెండు చట్టాల్లోనూ మార్పులు చేస్తున్నామని, బెదిరింపులకు పాల్పడుతున్న వారికి విమాన ప్రయాణం నిషేధించాలని ఆలోచన చేస్తున్నామని తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

లైవ్ చెస్ రేటింగ్స్‌లో 2 వేల 800 మార్క్‌ను దాటినందుకు భారత చెస్ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఎరిగైసిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈరోజు సామాజిక మాధ్యమం వేదికగా అభినందించారు. భారతదేశం గర్వపడేలా చేయడంలో ఆయన అసాధారణమైన ప్రతిభను, పట్టుదలను నరేంద్ర మోదీ తన సందేశంలో కొనియాడారు. ఇది చాలా మంది యువకులను చెస్ ఆడేందుకు ప్రపంచ వేదికపై ప్రకాశించేలా స్ఫూర్తినిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

=====================

కేరళలోని తిరువనంతపురం సమీపంలోని ముత్తలపోజి ఫిషింగ్ పోర్టు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని మత్స్యశాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ ప్రకటించారు. ఈరోజు తిరువనంతపురంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన కొత్త వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక ఆధారంగా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ప్రాజెక్ట్ కోసం ప్రతిపాదించిన 177 కోట్ల రూపాయల వ్యయాన్ని 60 : 40 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా భరిస్తాయన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద 106 కోట్ల 20 లక్షల రూపాయలను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ 70 కోట్ల 80 లక్షల రూపాయలు అందిస్తుందని ఆయన వివరించారు.

=====================

జపాన్ పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ 2024లో భారత స్టార్ షట్లర్ సుకాంత్ కదమ్ పురుషుల సింగిల్స్‌లో బంగారు పతకాన్ని తన భాగస్వామి దినేష్ రాజయ్యతో కలిసి పురుషుల డబుల్స్‌లో రజత పతకాన్ని గెలుచుకున్నారు. సింగిల్స్ ఫైనల్‌లో సుకాంత్, సహచర భారత షట్లర్ తరుణ్‌తో తలపడి 21-12, 21-10 స్కోరుతో విజయం సాధించారు.

=====================

గుజరాత్ అహ్మదాబాద్‌లో మహిళల భారత్, న్యూజిలాండ్ క్రికెట్ జట్ల మధ్య జరుగుతున్న రెండో వన్డేలో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 260 పరుగుల లక్ష్యాన్ని భారత్ జట్టు ముందు ఉంచింది. కడపటి వార్తలందే సమయానికి  భారత మహిళ జట్టు లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 42 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది.

=====================
=====================